# భ్రూణహత్యల నివారణే పరిష్కారం

జనరల్ స్టడీస్

### అదృశ్యమవుతున్న బాలికలు

ప్రకృతి ధర్మం ప్రకారం స్త్రీ, పురుష జనాభా సమానంగా ఉండాలి. లేదా వైద్య శాస్త్రం ప్రకారం స్త్రీ శిశువు జీవించడానికి ఎక్కువ అవకాశం ఉంది కాబట్టి మహిళల జనాభా అధికంగానైనా ఉండాలి. కానీ, భారతదేశంలో పురుషులతో పోలిస్తే స్త్రీల జనాభా తగ్గుతూ వస్తోంది. అమర్త్యసేన్ దీన్నే 'అదృశ్యమవుతున్న మహిళలు' అని పేర్కొన్నారు.

ఇటీవల విడుదలైన 2011 జనాభా లెక్కల ప్రకారం పురుషులతో పోలిస్తే స్త్రీల జనాభా కొద్దిగా పెరిగింది. బాలురతో పోలిస్తే బాలికల సంఖ్యలో తగ్గుదల భారీగా కనిపిస్తోంది. ఈ తగ్గుదల భవిష్యత్తులో స్త్రీ, పురుష నిష్పత్తిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉందని జనాభా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. బాల బాలికల నిష్పత్తిని చూసి - అదృశ్యమవుతున్న బాలికలు, అదృశ్యమవుతున్న కుమార్తెలు- అనే కొత్త భావన తెరపైకి వచ్చింది. చిన్నారి బాలిక బోరుబావిలో పడితే 24 గంటలపాటు ఆర్తనాదాలను ప్రసారం చేయడానికి మీడియా ముందుకొస్తోంది. అదే మీడియాకు దేశంలోని దుర్మార్గమైన సామాజిక పరిస్థితుల వల్ల లక్షల సంఖ్యలో ఆడ శిశువులు ప్రపంచాన్ని చూడకుండానే చనిపోతున్న భయానక వాతావరణం మాత్రం కనిపించడంలేదు. అందుకే సమాజంలో దీనిపై ఆశించిన స్థాయిలో చర్చ జరగడంలేదు.

### బాలబాలికల నిష్పత్తిలో భారీ తగ్గుదల

దేశవ్యాప్తంగా చూస్తే 0-6 సంవత్సరాల మధ్య వయసున్న ప్రతి వెయ్యిమంది బాలురకు కేవలం 914 మంది బాలికలు మాత్రమే ఉన్నారని 2011 జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి. దేశ చరిత్రలోనే బాలబాలికల నిష్పత్తి ఇంత తక్కువ ఎన్నడూ లేదని జనాభా లెక్కల వివరాలను చూస్తే అర్థమవుతోంది. 2001లో ఈ నిష్పత్తి 927 ఉండగా 2011లో ఇది 914 కు తగ్గింది. ప్రస్తుత స్త్రీ, పురుష నిష్పత్తి మాత్రం స్వల్పంగా పెరిగింది. 2001లో 933 గా ఉంటే 2011లో ఇది 940కి పెరిగింది. బాలబాలికల నిష్పత్తి తగ్గినప్పుడు స్త్రీ, పురుష నిష్పత్తిలో సాధించిన స్వల్ప పెరుగుదల తాత్కాలికమనే ఆందోళన వ్యక్తమవుతోంది. 1961 నాటి జనాభా లెక్కల నుంచి కూడా బాలబాలికల నిష్పత్తి పడిపోతూ వస్తోంది. 2001తో పోలిస్తే 2011లో పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో బాలబాలికల నిష్పత్తి కాస్త పెరిగింది. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే ఈ సంపన్న రాష్ట్రాల్లోనే బాలబాలికల నిష్పత్తి అతి తక్కువగా ఉండటం ఆందోళనకరం. మరోవైపు అనేక రాష్ట్రాల్లో బాలబాలికల నిష్పత్తి తగ్గింది. ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాల్లో బాలబాలికల నిష్పత్తి 900 కంటే కూడా తక్కువగా ఉంది. ఉదాహరణకు, హర్యానాలో 830, పంజాబ్‌లో 846, జమ్మూకాశ్మీర్‌లో 859, ఢిల్లీలో 866, రాజస్థాన్‌లో 883, మహారాష్ట్రలో కూడా 883, గుజరాత్‌లో 886, ఉత్తరాఖండ్‌లో 886, ఉత్తరప్రదేశ్‌లో 899 గా మాత్రమే ఉంది.

బాలబాలికల నిష్పత్తి 951 కంటే ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు 2001లో 18 ఉండగా వీటి సంఖ్య 2011లో 9కి తగ్గింది. దీనికి భిన్నంగా తక్కువ బాలబాలికల నిష్పత్తి అంటే 915 కంటే కూడా తక్కువ ఉన్న రాష్ట్రాల సంఖ్య 2001-11 మధ్యకాలంలో 9 నుంచి 14కు పెరిగింది.

### కారణాలు

ప్రస్తుత సమాజంపై పురుషాధిక్య విలువల ప్రభావం ఎక్కువగా ఉంది. అలాగే మగ పిల్లలే కావాలనే బలమైన కోరికలున్నాయి. ఇలాంటి వాతావరణంలో పరిమిత కుటుంబ భావన ఆడ శిశువులకు శాపంగా మారుతుందనే అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది. లింగ నిర్ధారణ పరీక్షలను చట్టం నిరోధిస్తున్నా, ఆచరణలో ఈ చట్టం సక్రమంగా అమలుకావడంలేదు. దీంతో స్త్రీ శిశు, భ్రూణ హత్యలు దేశంలో యథేచ్ఛగా సాగుతున్నాయని ఈ రంగంలో కృషిచేస్తున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో కొంతమంది మొదటి సంతానం కొడుకు అయితే రెండో సంతానాన్ని కోరుకోవడంలేదని క్షేత్రస్థాయి పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

లింగ నిర్ధారణ పరీక్షల నివారణ చట్టం- 1994 (పీసీపీఎన్‌డీటీ - ప్రి కన్సెప్షన్ అండ్ ప్రి నాటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ యాక్ట్) అమల్లో ఉన్నా, లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించే యంత్రాల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పీసీపీఎన్‌డీటీ గురించి అధికారుల్లో సరిగ్గా అవగాహన లేకపోవడంతో ఇది పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదు. వీరికి సరైన శిక్షణ లేదు. తీరిక, చిత్తశుద్ధి అంతకంటే కనిపించడం లేదు. గ్రామాల్లోకి మొబైల్ స్కానింగ్ సెంటర్లు వెళ్తున్నాయి. వైద్యవృత్తిలో అవినీతి కూడా లింగ నిర్ధారణ పరీక్షలకు కారణమవుతోంది. వివిధ స్థాయిల్లో ఉండే పర్యవేక్షణ కమిటీలు సరిగ్గా పనిచేయడంలేదు. ఈ కీలక చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలనే రాజకీయ సంకల్పం ప్రభుత్వాల్లో కూడా కొరవడుతోంది.

### ప్రపంచ ధోరణులు

ఐక్యరాజ్య సమితి 'ప్రపంచ జనాభా ధోరణులు' పేరుతో విడుదల చేసిన నివేదిక ప్రకారం అమెరికా, రష్యా, జపాన్, బ్రెజిల్ లాంటి దేశాల్లో పురుషుల కంటే స్త్రీల సంఖ్య అధికంగా ఉంది. మియన్మార్, నేపాల్, శ్రీలంకల్లో కూడా స్త్రీ, పురుష నిష్పత్తి వెయ్యికంటే ఎక్కువగా ఉంది. భారతదేశంలో 1901లో 970గా ఉన్న స్త్రీ, పురుష నిష్పత్తి క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం అంటే 2011లో 940కు పడిపోయింది. ఇటీవల కాలంలో మాత్రమే మనదేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి స్వల్పంగా పెరుగుతూ వస్తోంది.

బాలబాలికల నిష్పత్తి భారీగా పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఈ స్త్రీ, పురుష నిష్పత్తిలో సాధించిన పెరుగుదల నిలుస్తుందా అనేది అనుమానమే. స్త్రీ, పురుష నిష్పత్తి 916 కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాల సంఖ్య 2001-11 మధ్య కాలంలో 12 నుంచి 10కి తగ్గింది.

### రాష్ట్రాల మధ్య అసమానతలు

దేశం మొత్తం మీద చూస్తే స్త్రీ, పురుష నిష్పత్తిలో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ వివిధ రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలున్నాయి. ఉదాహరణకు హర్యానాలో కేవలం 877,



పంజాబ్‌లో 893 గా మాత్రమే స్త్రీ పురుష నిష్పత్తి ఉంది. జమ్మూ కాశ్మీర్‌లో 883, సిక్కింలో 889 గా ఉంది.

ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధించిన ప్రాంతాలు, రాష్ట్రాల్లో కూడా స్త్రీ, పురుష నిష్పత్తి తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఉదాహరణకు హర్యానా, పంజాబ్‌లు దేశంలోనే సంపన్న రాష్ట్రాలు. ఇక్కడే స్త్రీ, పురుష నిష్పత్తి చాలా తక్కువగా ఉండటం గమనార్హం. అమర్త్యసేన్ అన్నట్లు ఆర్థికాభివృద్ధి సాధించినంత మాత్రాన సామాజిక, మానవాభివృద్ధి సాధించలేమని ఈ వివరాలు మరోసారి తెలియజేస్తున్నాయి.

జిల్లాల వారిగా వివరాలను పరిశీలిస్తే మరో విషయం కూడా కనిపిస్తోంది. విద్యార్హత, అక్షరాస్యతలు పెరిగినా కూడా లింగ వివక్షత తగ్గడం లేదు. ఉదాహరణకు, హర్యానాలోని జజ్జర్ జిల్లాలో అక్షరాస్యత 80.8 శాతం. ఇందులో పురుషుల అక్షరాస్యత 89.4 శాతం, స్త్రీల అక్షరాస్యత 71 శాతం. ఈ జిల్లాలో ఎక్కువ అక్షరాస్యత ఉన్నప్పటికీ బాలబాలికల నిష్పత్తి 774 మాత్రమే. దీనికి భిన్నంగా మేవట్ జిల్లాలో అక్షరాస్యత కేవలం 56.1 శాతం మాత్రమే. ఇందులో మహిళా అక్షరాస్యత 37.6 శాతం. కానీ ఈ జిల్లాలో బాల బాలికల నిష్పత్తి అత్యధికంగా అంటే 903 గా, స్త్రీ, పురుష నిష్పత్తి 906 గా ఉంది. ఉత్తరాఖండ్‌లో నైనిటాల్, డెహ్రాడూన్, హరిద్వార్ లాంటి జిల్లాల్లో కొండ ప్రాంతంలోని జిల్లాలో కంటే కూడా తక్కువ స్త్రీ పురుష నిష్పత్తి ఉంది.

తల్లి పదో తరగతి కంటే ఎక్కువగా చదువుకున్న కుటుంబాల్లో బాల బాలికల నిష్పత్తి తక్కువగా ఉంది. అంటే ఆర్థికాభివృద్ధి, విద్య, అక్షరాస్యత లాంటివి పెరిగినా కూడా బాలికల, మహిళల సంఖ్యలో పెరుగుదల నమోదు కావడంలేదు. ఈ కుటుంబాల్లో కొడుకు కావాలన్న కోరిక బలంగా ఉంటోంది. కాబట్టి లింగ నిర్ధారణ పరీక్షలపై కచ్చితమైన నియంత్రణ ఉండాలి. సమాజంలో మహిళల స్థితిగతుల్లో ముఖ్యంగా వారి విద్య, ఆర్థిక, సామాజిక స్థాయిలో గణనీయమైన ప్రగతిని సాధిస్తే తప్ప ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం దొరకదు. దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను మాత్రమే చూస్తే విషయం పూర్తిగా అర్థం కాదు.

రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల మధ్య స్త్రీ, పురుష, బాల బాలికల నిష్పత్తులను మరింత లోతుగా అధ్యయనం



ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

చేయాల్సి ఉందని 'భారతదేశంలోని జనాభా ధోరణుల్లో లింగ నిష్పత్తి' అనే పుస్తక రచయిత సతీష్ అగ్నిహోత్రి వ్యాఖ్యానించారు. పరిస్థితిలో స్వల్ప పెరుగుదల ఉన్నా దీన్లో కూడా తీవ్ర అసమానతలున్నప్పుడు సాధించిన ప్రగతి నిలబడుతుందని చెప్పలేమని సతీష్ అగ్నిహోత్రి విశ్లేషిస్తున్నారు.

### చట్టం అమల్లో ఇబ్బందులు

ఈ పరిస్థితిని నివారించడంలో ముఖ్యమైంది పీసీపీఎన్‌డీటీ చట్టం. దీన్ని అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను వివిధ అధ్యయనాలు వివరిస్తున్నాయి. వాటిలో కొన్ని లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలు. అటు చేస్తున్నవారికి, ఇటు చేయించుకుంటున్న వారికి మధ్య అవగాహనతోనే ఇవి జరుగుతున్నాయి. ఇందులో వీటిపై ఫిర్యాదులు చేసేవారు లేరు. ఫిర్యాదులు లేనప్పుడు చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని అధ్యయనాల్లో సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈ చట్టం కింద ప్రతి ఏడాది వార్షిక నివేదికలను తయారు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ చట్టం అమలు తీరుపై 2005 తర్వాత వార్షిక నివేదికనే రూపొందించలేదంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. నేరాలకు పాల్పడుతున్న వారిని శిక్షించాలంటే సాక్ష్యాలుండాలి. ఫిర్యాదులే లేనప్పుడు ఇక సాక్ష్యాలు ఎక్కడి నుంచి వస్తాయి. పీసీపీఎన్‌డీటీ చట్టం అమల్లో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన చీఫ్ మెడికల్ ఆఫీసర్, సివిల్ సర్జన్‌లు సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. ఈ చట్టం అమలుకు సంబంధించి పూర్తిస్థాయిలో తాము సిద్ధంగా లేమని చాలామంది చెప్పినట్లు 2005 నాటి వార్షిక నివేదిక పేర్కొంది. సంబంధిత అధికారులకు ఈ విషయంలో చట్టపరమైన నైపుణ్యం లేదు. దానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు కూడా లేవు.

ప్రజల్లో కూడా లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు నేరమనే భావన కనిపించడంలేదు. పరిమిత కుటుంబాల్లోని వారు కొడుకు మాత్రమే కావాలనే తమ కోరికను తీర్చుకోవడానికి దీన్ని ఒక మార్గంగా భావిస్తున్నారు. పురుషాధిక్య విలువలు సమాజంపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపినప్పుడు బాలిక వద్దనుకోవడం వారికి నేరమనిపించడం లేదు. దీనికి అవసరమైన పద్ధతులను పాటించడాన్ని దురదృష్టవశాత్తు నేరంగా పరిగణించడం లేదు. ఈ చట్టం కింద పెద్దగా శిక్షలు పడిన దాఖలాలు లేవు. ఎలాంటి నైపుణ్యం, అర్హత లేని వారు కూడా గర్భస్రావాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. చట్టవిరుద్ధమైన ఈ కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి. పడిపోతున్న బాలికల సంఖ్యను నివారించడంలో ప్రభుత్వ యంత్రాంగాలు ప్రేక్షక పాత్రను పోషిస్తున్నాయని స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### పరిష్కార మార్గాలు

మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టాలి. వరకట్న సమస్యను పరిష్కరించాలి. వరకట్న బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలి. ఇవన్నీ పరిష్కారం కాకుండా బాలికల సంఖ్య పెరగాలనుకోవడం సరికాదు. పెరుగుతున్న వివాహ వ్యయం, మహిళలకు ఆర్థిక, ఆస్తి పరంగా హక్కులు అమలు కాకపోవడం లాంటి సమస్యలను పరిష్కరించకుండా బాలికల సంఖ్య పడిపోయే ధోరణిని అరికట్టలేం. లాన్సెట్ అనే ప్రముఖ వైద్యశాస్త్ర పరిశోధన పత్రిక భారతదేశంలో జనాభా ధోరణులను, కుటుంబ ఆరోగ్య సర్వే వివరాలను కలిపి అధ్యయనం చేసి ఈ సమస్యపై మరింత ఆసక్తికర అంశాలను వెల్లడించింది. మొదటి సంతానం కొడుకు అయితే కుటుంబాల్లో బాల బాలికల నిష్పత్తి మరింత తక్కువగా ఉంటోంది. ఇది బాలికలపై మరింత ప్రతికూలంగా ఉంటోంది.

స్త్రీ, పురుష నిష్పత్తి, బాలబాలికల నిష్పత్తులను కూడా ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధికి కొలబద్దగా చూస్తోంది. అందుకే దీన్ని కేవలం మహిళల అభివృద్ధి సమస్యగా మాత్రమే కాకుండా దేశ సామాజికాభివృద్ధి సమస్యగా గుర్తించాలి. అన్ని రంగాల్లో మహిళల స్థాయిని పెంచడం ద్వారా ఈ సమస్యను శాశ్వత ప్రాతిపదికన ఎదుర్కోవచ్చు. ముఖ్యంగా రాజకీయ రంగంలో మహిళలకు నాయకత్వ అవకాశాలను పెంచాలి. అయితే ఈ దీర్ఘకాల పరిష్కారాలతో పాటు సంబంధిత చట్టాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా స్త్రీ శిశు హత్యలను, భ్రూణ హత్యలను నివారించవచ్చు.

(రచయిత జర్నలిజం అధ్యాపకులు, కాలమిస్టు)